
సాక్షి
బాపట్ల
మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025



పోలింగ్ ఏర్పాట్లు పరిశీలన

ముప్పాళ్ల: ముప్పాళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎమ్.భవానీశంకర్ సోమవారం పరిశీలించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 532.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 8,067 క్యూసెక్కులు విడుదలవుతోంది.



యూరియా దిగుమతి

తెనాలిటౌన్: రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా జొన్న, మొక్కజొన్న పంటలకు అవసరమైన యూరియాను సోమవారం రైలు వ్యాగన్ ద్వారా తెనాలికి దిగుమతి అయ్యింది.

న్యూస్‌రీల్

వైభవంగా మల్లన్న తలపాగా గ్రామోత్సవం



వేటపాలెం: మండలం పరిధిలోని రామన్నపేటలో నియమ నిష్ఠలతో చేనేత మగ్గంపై నేసిన మల్లన్న తలపాగాకు వైభవంగా సోమవారం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం తలపాగాను గ్రామంలోని శివాలయంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. రామన్నపేట కొత్తనగర్‌కి చెందిన సాదు శ్రీనివాసరావు (శివస్వామి) 41 రోజులు శివుని మాల ధరించి 360 మీటర్ల తలపాగా వస్త్రాన్ని తయారు చేశారు. ఈ నెల 26వ తేదీన శ్రీశైలంలోని ఆలయంలో శిఖరానికి కట్టనున్నారు. ఈ సందర్భంగా గ్రామ సేనాధిపతులు, ప్రజల సహకారంతో తలపాగా గ్రామోత్సవం నిర్వహించారు. తలపాగా నేసిన శివస్వామి ఇంటి నుంచి ఊరేగింపుగా రామలింగేశ్వర దేవస్థానానికి తీసుకొని వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం శ్రీశైలం తీసుకెళ్లనున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఏదవంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఊటుకూరి సుబ్రహ్మణ్యస్వామి, చేనేత విభాగం అధ్యక్షులు పిచ్చుక శ్యామ్, బండ్ల వెంకటేశ్వరరావు, లింగమూర్తి, రాష్ట్ర చేనేత మహిళా విభాగం అధ్యక్షురాలు బండ్ల తిరుమలాదేవి, అధికార ప్రతినిధి యారాసు అరుణ్‌బాబు, కర్మా రాహుల్, బండ్ల బాబు, పృథ్వీ ఆదిశేషు, పిచ్చుక భార్గవ్, చల్లా విజయ్, భూసం శ్రీనివాసరావు, ఆలయ కమిటీ అధ్యక్షులు పింజల శ్రీనివాసరావు, బండ్ల సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పుష్కర ఘాట్లు పరిశీలన



తాడేపల్లి రూరల్: మహాశివరాత్రి సందర్భంగా కృష్ణానది దిగువ ప్రాంతంలో పుష్కరఘాట్లకు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వేలాది మంది భక్తులు తరలి రానున్న నేపథ్యంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం కార్పొరేషన్ డీఈ రాము, ఏఈ అనూష సంబంధిత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పుణ్యస్నానాల అనంతరం దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తాగునీటిని అందుబాటులో ఉంచుతామని చెప్పారు. పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నారని, మంగళవారం సాయంత్రానికి పనులు పూర్తి అవుతాయని వివరించారు. బుధవారం తెల్లవారుజాము నుంచి పుణ్యస్నానాలకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.

న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీగా బాధ్యతల స్వీకరణ



గుంటూరు లీగల్ : గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీగా న్యాయమూర్తి సయ్యద్ జియావుద్దీన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా కోర్టు న్యాయవాదులు ఈ సందర్భంగా న్యాయమూర్తి జియావుద్దీన్‌కు అభినందనలు తెలిపారు. మొదటి జూనియర్ సివిల్ జడ్జిగా సమర్థంగా విధులు నిర్వహించి, క్రమశిక్షణకు మారుపేరుగా ఆయన అందరి మన్ననలు పొందారని పలువురు ప్రశంసించారు.

గజ వాహనంపై మల్లేశ్వరుడు



మంగళగిరి టౌన్: మంగళగిరిలోని శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం గజవాహనంపై మల్లేశ్వరుడు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళగిరి శ్రీ పద్మశాలీయ బహూత్తమ సంఘం కైంకర్య పరులుగా వ్యవహరించారు. దేవస్థాన ఈవో జె.వి. నారాయణ ఉత్సవ నిర్వహణను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతక్రింద కనకయ్య, దామర్ల కుబేరస్వామి, శివాలయం, సీతారామ దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్లు బోగి కోటేశ్వరరావు, మునగపాటి వెంకటేశ్వరరావు, వాకా మంగారావు తదితరులు పాల్గొన్నారు.

బేరీజు.. బేజారు

- రూ.60 కోట్ల సేవాపన్ను ఎగవేతదారునిగా ఆలపాటి
- భూకబ్జాలు, రౌడీయిజం, అనైతిక రాజకీయాలు..
- ఎన్నికల సమయంలోని కరపత్రాలు వెలుగులోకి..
- వైఎస్సార్ సీపీకి దగ్గరంటూ లక్ష్మణరావుపై ట్రోలింగ్
- పోటాపోటీగా సోషల్ మీడియాలో పరస్పర పోస్టింగులు
- అభ్యర్థుల గుణగణాలపై పట్టభద్రుల లోతైన పరిశీలన
- ఓటర్లు బేరీజు వేసుకుంటున్నారంటూ కూటమిలో బేజారు

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: ఓటర్లు నిశానీలు కారు. పట్టభద్రులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, చిరుద్యోగులు, నిరుద్యోగులు. విభిన్న రంగాలు, వర్గాలకు చెందిన 3,47,116 మంది ఓటర్లు. సోషల్ మీడియాలో ప్రధాన పోటీదారుల గుణగణాలు, గత చరిత్ర, రాజకీయ వ్యవహారాలు ఆధారసహితంగా హోరెత్తుతున్నాయి. పలు ఊహాజనిత, నిరాధార ఆరోపణలూ జోరందుకున్నాయి. ఈ ఎన్నికలు ఈవీఎంలతో కాదు బ్యాలెట్ పేపర్ పద్ధతిలో జరగనున్నాయి. తొమ్మిది నెలలుగా పచ్చమీడియా సహకారంతో పడికట్టు, కనికట్టు మాటలతో మోసగిస్తున్న ప్రభుత్వ పాలనా తీరు ప్రతిఒక్కరి కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. అసలే రాజకీయ చైతన్యవంతమైన జిల్లాలకు చెందిన పట్టభద్రులు ప్రతిదీ బేరీజు వేసుకుని కర్రుకాల్చి వాతపెడతారేమోననే బేజారు టీడీపీ నేతల మాటల్లో వ్యక్తమవుతోంది.

కూటమి నేతల్లో ఆందోళన

కృష్ణా– గుంటూరు పట్టభద్రుల స్థానానికి ఎన్నికల పోలింగ్ సమయం సమీపిస్తున్న కొద్దీ కూటమి నేతల్లో ఆందోళన అధికమవుతోంది. ఈనెల 27న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో టీడీపీకి చెందిన కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రధాన పోటీదారైన పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు మద్దతుదారులు పోటాపోటీగా సోషల్ మీడియా వార్‌కు తెరతీశారు. అభ్యర్థులిద్దరూ జిల్లా కేంద్రమైన గుంటూరుకు చెందిన వారైనప్పటికీ రాష్ట్ర రాజకీయాలలో సుపరిచితులు.



కేఎస్ లక్ష్మణరావు



ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

మాజీ మంత్రి ఆలపాటి సీనియర్ నాయకుడు. విద్యావేత్త అయిన లక్ష్మణరావు 14 ఏళ్లుగా శాసనమండలి నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. కూటమి అభ్యర్థి గురించి ఆయా సందర్భాలలో తీవ్ర అవినీతి ఆరోపణలు, ఆర్థిక అరాచకాలు, రౌడీయిజం, దాడులు లాంటి నేరారోపణలు, పలు విమర్శలు లేకపోలేదు. వాటన్నింటినీ గుర్తుచేస్తూ సోషల్ మీడియా ద్వారా ప్రజల దృష్టికి తీసుకొస్తుండటం తాజాగా చర్చనీయాంశమైంది. కూటమి నేతలకు ఇది కొరుకుడుపడని అంశంగా మారి ఆందోళన రేకెత్తిస్తోంది.

రూ.60 కోట్ల పన్ను ఎగవేత?

ఆర్థిక లావాదేవీల్లో లోపాలతోపాటు పన్నులు ఎగ్గొట్టారనే నేరారోపణలు ఆలపాటి రాజేంద్రప్రసాద్‌పై ఉన్నాయి. అప్పీలుకు వెళ్లగా కేంద్ర ప్రభుత్వ సంస్థలు కూడా తోసిపుచ్చాయని, పన్నులు చెల్లించాల్సిందేనని హైకోర్టు నిర్ధారించిందని రాజకీయ ప్రత్యర్థులు గుర్తుచేస్తున్నారు. ఎస్.ఆర్.ఐ. విద్యా సంస్థల ద్వారా విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజుల్లో అరవై కోట్ల రూపాయలకు పైగా సర్వీసు టాక్సును ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందని, దీనిపై ఇప్పటికీ న్యాయస్థానాల్లో కేసులు కొనసాగుతున్నాయని అంటున్నారు.

■ తెనాలి అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేస్తారనే అంచనాలతో ఆలపాటి రాజకీయ ఆరంగేట్రం మొదలు ఆయన అకృత్యాలంటూ ప్రత్యర్థులు కరపత్రాలు ముద్రించి మరీ ప్రజల దృష్టికి అనేక అంశాలను ఇదివరకే తీసుకొచ్చారు. పల్నాడు ప్రాంతంలో గొర్రెల పెంపకం మాటున, సాఫ్ట్‌వేర్ సంస్థ చాటున, గుంటూరులో చిట్‌ఫండ్, ఫైనాన్స్ ద్వారా, తన సంబంధీకుల పేరుతో, ఇతర బినామీల పేరిట రియల్ ఎస్టేట్ ముసుగులో అటు బ్యాంకులను, ఇటు ప్రజలను మోసం చేశారని, తన రాజకీయ పలుకుబడి, దౌర్జన్యాలతో సెటిల్‌మెంట్లు చేసుకున్నారనే ఆరోపణలు గుప్పించారు. మంత్రిగా ఉన్నప్పుడు భారీగా జిల్లాలో ఇసుక కుంభకోణాలకు పాల్పడ్డారని, ఇంజినీరింగ్ కాలేజీలకు అనుమతుల ద్వారా రూ.కోట్లు సంపాదించారని, మంగళగిరి– తాడేపల్లి పరిధిలోని ఆంధ్ర సిమెంటు ఫ్యాక్టరీని బినామీ పేర్లతో కొనుగోలుచేసి కార్మికులకు నష్టం చేశారని, విభిన్న ప్రాంతాల్లో క్రిష్టియన్ ఆస్తులను కొల్లగొట్టి స్థిరాస్తులుగా మలచుకున్నారనే తీవ్రారోపణలు లేకపోలేదు. ఎస్.ఆర్.ఐ ఆసుపత్రి వ్యవహారాల్లోనూ ఆలపాటిపై అనేక విమర్శలు రావడాన్ని గుర్తుచేస్తున్నారు.

లక్ష్మణరావుపైనా పోస్టింగులు..

పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావుపైనా సోషల్ మీడియాలో వ్యతిరేక ప్రచారం పెచ్చరిల్లుతోంది. అవినీతి ఆరోపణలు, రాజకీయపరమైన అంశాలు అటుంచి వ్యక్తిత్వ హననానికి ప్రత్యర్థులు తెగపడ్డారని, లేనిపోని విషయాలను చిలవలు పలవలు చేస్తున్నారని ఆయన మద్దతుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వినతి పత్రం ఇచ్చేప్పుడు కిందపడిన కాగితాలను తిరిగి తీసుకునే క్రమంలో లక్ష్మణరావు సీఎం పాదాలకు నమస్కరించారని, ఆయన వైఎస్సార్ సీపీ మద్దతుదారు అని ట్రోల్ చేయడం వారి దిగజారుడుతనానికి పరాకాష్ఠ అంటున్నారు. మూడు పర్యాయాలు పీడీఎఫ్ సభ్యునిగా శాసన మండలికి ఎన్నికై విభిన్న అంశాలను చర్చకు తీసుకొచ్చి, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేసిన లక్ష్మణరావుపై యూటీఎఫ్ తదితర సంఘాల పేరిట తప్పుడు పోస్టింగులు కూడా పెట్టిస్తుండటాన్ని ఆయా సంఘాల నేతలు ఖండిస్తున్నారు. కె.ఎస్.లక్ష్మణరావుపై తప్పుడు ప్రచారం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు సోమవారం ఫిర్యాదులు చేయడం గమనార్హం.

గోవాడలో మహాశివరాత్రి వేడుకలు ప్రారంభం

అమర్తలూరు (వేమూరు): మహా శివరాత్రికి అమర్తలూరు మండలంలోని గోవాడ శ్రీ బాల కోటేశ్వర స్వామి దర్శనార్థం పెద్దసంఖ్యలో భక్తులు రానున్నందున తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ బి.అశోక్‌కుమార్ తెలిపారు. ఉత్సవాల సందర్భంగా తిరునాళ్ల 5 రోజులపాటు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు భారీగా ఉంటాయన్నారు. ఇప్పటికే ఆలయాన్ని రంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. రద్దీ నియంత్రణకు ఇనుప బారికేడ్లతో క్యూలైన్లు, ఎండ తీవ్రత తట్టుకునేలా భక్తుల కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు. తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. పొన్నూరు, తెనాలి, గుంటూరు, బాపట్ల, రేపల్లె ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. సోమవారం ఏకాదశి కావడంతో స్వామి వారికి అభిషేకం, హుండీలు, గ్రామోత్సవంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. పశువులు, వాహనాలతో భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. 25వ తేదీన విద్యుత్ ప్రభను, శిఖర గొడుగును గ్రామం నుంచి మేళతాళాలతో తీసుకొచ్చి ప్రభకు శిఖర గొడుగును అలంకరించనున్నారు. ప్రభను నిలబెట్టి వేడుకలు నిర్వహించనున్నారు. 25వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకు అర్చకులు మూడు ప్రదక్షిణలు చేసి మొదటి అభిషేకం ప్రారంభించనున్నారు. అప్పటి నుంచి భక్తుల కోరిక మేరకు 26వ తేదీ ఉదయం 7.30 గంటల వరకు దేవస్థానం గర్భాలయంలో అభిషేకాలు చేస్తారు. ఈ అభిషేకం టికెట్ ధర రూ. 2 వేలుగా నిర్ణయించారు. ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనానికి అవకాశం కల్పిస్తారు. ఉదయం 8 – సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక అభిషేక మండపంలో అభిషేకాలు జరుగుతాయి. ఈ టికెట్ ధర రూ.200గా నిర్ణయించారు. రాత్రి 10 గంటలకు లింగోద్భవ కాల అభిషేకం ప్రారంభిస్తారు. మహాశివరాత్రి రోజున నిత్యం స్వామి వారి ఉచిత దర్శనం కొనసాగుతుందని ఈవో తెలిపారు. 26వ తేదీన ఉదయం 6 గంటల నుంచి దర్శనాలు, అభిషేకాలు రాత్రి 9 గంటల వరకు కొనసాగుతాయి. 28వ తేదీ వరకు తిరునాళ్ల మహోత్సవాలు జరుగుతాయని ఈవో తెలిపారు.



శ్రీ బాల కోటేశ్వర స్వామి దేవస్థానం

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. సోమవారం పరీక్షల నిర్వహణపై వీక్షణ సమావేశం ద్వారా చీఫ్ సూపరింటెండెంట్‌లతో జిల్లా కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ పబ్లిక్ పరీక్షలు జరుగుతాయని అన్నారు. జిల్లాలోని 36 సెంటర్లలో మొత్తం 19,219 మంది హాజరవుతున్నారని తెలిపారు. విద్యార్థులకు బస్సు సౌకర్యం కోసం ఆర్టీసీకి లేఖ రాయాలన్నారు. విద్యార్థులకు ప్రయాణంలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రం చుట్టుపక్కల మండల రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో 144 సెక్షన్ పెట్టనున్నట్లు తెలిపారు. ఇన్విజిలేటర్లు తక్కువగా ఉంటే సంబంధిత ఎంఈఓలకు చెప్పి సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిర్దేశించిన సెట్ పేపర్లు అదే రోజు ఉదయం ఇస్తారని, పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఆ ప్రకారంగా సెట్ తీసుకోవాలని తెలిపారు. పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరగాలన్నారు. విద్యార్థులను 12 గంటల తర్వాత మాత్రమే బయటకు అనుమతించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ విద్యాధికారి ఎర్రయ్య, సర్వ శిక్ష అభియాన్ అధికారి నాగిరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ కోదండరాం, జిల్లా పరీక్షా కమిటీ మెంబర్ సీహెచ్ సతీష్ బాబు, బీపీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శేషకుమారి, చీరాల ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపల్ స్నేహలత తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

ఎమ్మెల్యే ఓకే.. ఎంపీ నాట్ ఓకే

అక్రమంగా ఇసుక, బుసక, గ్రావెల్, గ్రానైట్ అమ్మినా, చివరకు విలువైన ప్రభుత్వ భూములు కబ్జా చేసి తెగనమ్ముకున్నా సరే ఆయన ఎమ్మెల్యే అయి ఉండాలి, లేదా ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడైనా అయ్యుండాలి. అలా ఐతే ఓకే. వారు ఏం చేసినా ఫర్వాలేదు. ఎలాంటి అక్రమాలకు తెగబడినా చర్యలు శూన్యం. ఎంపీ వర్గీయులైతే మాత్రం అంగీకరించేదే లేదు. చర్యలు మాత్రం తప్పవు. ఇదీ బాపట్లలో రెవెన్యూ, పోలీసు అధికారుల తీరు.



ప్రైవేటు వెంచర్‌ను ఆనుకుని ఎమ్మెల్యే అనుచరులు ఆక్రమించిన ప్రభుత్వ భూమి



ఎంపీ అనుచరులు వేసిన గుడిసెలు తొలగించాక ప్రభుత్వ భూమి అని ఏర్పాటైన హెచ్చరిక సూచిక

- శాసనసభ్యుడి వర్గం ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసినా నిరభ్యంతరం
- ఎంపీ వర్గీయులు అదే పని చేస్తే చర్యలు
- బాపట్ల శివారు వైఎస్సార్ నగర్‌లో 4.74 ఎకరాల స్థలం
- నగం కబ్జా చేసి అమ్మకానికి పెట్టిన ఎమ్మెల్యే అనుచరులు
- సెంటు స్థలానికి రూ. 50 వేలు వసూలు
- ఇక్కడే ఆక్రమించి గుడిసెలు వేసిన ఎంపీ వర్గీయులు
- ఎమ్మెల్యే ఫిర్యాదుతో రంగంలోకి దిగి రెవెన్యూ, పోలీసులు చర్యలు
- ఎమ్మెల్యే వర్గం విక్రయించిన స్థలంవైపు కన్నెత్తి చూడని వైనం
- చర్చనీయాంశంగా బాపట్ల అధికారుల తీరు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: తాజాగా బాపట్ల శివారులోని వైఎస్సార్ నగర్‌లో రూ. కోట్లాది విలువైన ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైన విషయంలో అధికారులు స్పందించిన తీరు ఇప్పుడు జిల్లాలోనే చర్చనీయాంశంగా మారింది. బాపట్ల శివారులోని 204, 207, 208, 209, 210 సర్వేనంబర్ల పరిధిలో ఉన్న 4.74 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆదివారం తెల్లవారుజామున బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ అనుచరులు ఆక్రమించి గుడిసెలు వేశారు. బాపట్ల ఎమ్మెల్యే అనుచరులు దీనిపై ఎమ్మెల్యేను కదిలించారు. ఎమ్మెల్యే ఏం చక్రం తిప్పారో తెలియదుగానీ సాయంత్రానికి సీన్ మారిపోయింది. బాపట్ల ఆర్డీవో గ్లోరియా, తహసీల్దారు, ఇతర రెవెన్యూ అధికారులతోపాటు సీఐలు, ఎస్సైలు, పోలీసు బలగాలు సదరు గుడిసెలు వేసిన స్థలాన్ని చుట్టుముట్టారు. ప్లాస్టిక్ పట్టల గుడిసెలను కూల్చి శిథిలం చేసి జబ్బలు చరుచుకున్నారు.

వీరికి మరో న్యాయం..

అదే స్థలాన్ని కబ్జా చేసేందుకు సిద్ధంగా ఉన్న ఎమ్మెల్యే అనుచరులు ఇటీవలే ఆ స్థలంలో మూడో వంతు ఆక్రమించారు. చదును చేసి ప్లాట్లేసి అమ్మకానికి పెట్టారు. పైగా లాటరీ పద్ధతిలో ప్లాట్లను కేటాయించడం విశేషం. ఒక్కో ప్లాటుకు పెద్ద మొత్తంలో వసూలు చేసినట్లు సమాచారం. ఇందులో చాలా ప్లాట్లు ఎమ్మెల్యే అనుచరుల బినామీలవేనన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. సదరు ఎమ్మెల్యే అనుచరులు మిగిలిన స్థలాన్ని కూడా ప్లాట్లుగా చేసి అమ్మకానికి పెడుతున్నట్లు ప్రకటించారు. డబ్బులు వసూలు కార్యక్రమానికి తెరతీయగా కొందరు అడ్వాన్స్ బుకింగ్‌లు కూడా పూర్తి చేసుకున్నట్లు సమాచారం.

పంపిణీ అడ్డుకునేందుకు కోర్టుకు...

ప్రభుత్వస్థలాన్ని ఎవరు ఆక్రమించినా తప్పే. కానీ పక్షపాతం చూపిన అధికారులపై విమర్శలు వస్తున్నాయి. ఆ స్థలంలో వందలాదిమంది పేదలకు పట్టాలివ్వాలని అప్పటి ఎమ్మెల్యే కోన రఘుపతి సూచనతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. విలువైన స్థలాన్ని కబ్జా చేయాలన్న కుట్రతో నాడు పచ్చనేతలు స్థలం తమదంటూ ఉద్దేశపూర్వకంగా కోర్టులో కేసు వేయించారు. పేదలకు పట్టాల పంపిణీ జరగకుండా అడ్డుకున్నారు. అధికారం రాగానే అదే స్థలాన్ని ఇటు ఎమ్మెల్యే, అటు ఎంపీ అనుచరులు కబ్జా చేసేందుకు సిద్ధమయ్యారు.

కొందరు అధికారుల అండతోనే..

ఇదంతా బాపట్ల రెవెన్యూ, పోలీసు అధికారులకు తెలియదనే అనుకుందాం. ఆదివారం ఎంపీ అనుచరుల గుడిసెలు కూల్చేందుకు కట్టగట్టుకొని వచ్చిన వారు అదే స్థలంలో ప్లాట్లు వేసి కొత్తగా రంగులు పూసి, రోడ్లు కూడా వేసి ఉండడం కనిపించకుండా ఉండే అవకాశం లేదు. పోనీ వారికి కనపడలేదనుకున్నా.. గుడిసెలు వేసుకున్న వారందరూ ఇదే స్థలాన్ని చాలామందికి అమ్మారని, ఎంతకు అమ్ముకున్నారో, ఎవరెవరు కొన్నారో? కూడా ఆర్డీవో మొదలు మిగిలిన అధికారుల ముందు చెప్పారు. కానీ ఎంపీ అనుచరుల ఆక్రమిత గుడిసెలను మాత్రమే తొలగించి, ఇది ప్రభుత్వ స్థలమని బోర్డు పెట్టారు. ఎమ్మెల్యే అనుచరులు వేసిన ప్లాట్లు రంగులద్దుకొని కళ్లముందున్నా వాటి జోలికి ఎందుకు వెళ్లలేదు? ప్రభుత్వ స్థలమని బోర్డులు ఎందుకు పెట్టలేదో వారికే తెలియాలి? పైగా స్థానికులు ఫిర్యాదులు చేసినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక మతలబేమిటో కూడా అధికారులు వెల్లడించాలి.

క్లుప్తంగా

శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

రేపల్లె రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రసిద్ధి గాంచిన శైవ క్షేత్రాలకు భక్తుల సౌకర్యార్థం రేపల్లె ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఎస్.సునీల్ కుమార్ తెలిపారు. స్థానిక డిపో గ్యారేజీలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శివరాత్రి సందర్భంగా రేపల్లె నుంచి గోవాడకు 10, కోటప్పకొండకు 15, అరవపల్లి బాలకోటేశ్వర స్వామి సన్నిధికి రెండు ప్రత్యేక సర్వీసుల చొప్పున ఏర్పాటు చేశామన్నారు. సర్వీసులను తిరునాళ్ల సందర్భంగా ఉదయం నుంచి నిరంతరం తిప్పటం జరుగుతుందని, భక్తులు ఈ సర్వీసులను వినియోగించుకుని ఆర్టీసీ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.

పురస్కారానికి వడలి రాధాకృష్ణ ఎంపిక



చీరాల అర్బన్: కథా రచయిత, చీరాల సహజ సాహితి వ్యవస్థాపక అధ్యక్షుడు వడలి రాధాకృష్ణను పొద్దుటూరుకు చెందిన సాహితీ నిర్వాహక సంస్థ ఈ సంవత్సరపు కొనిరెడ్డి ఫౌండేషన్, చదువుల సాహిత్య వేదిక విశిష్ట పురస్కారానికి ఎంపిక చేసినట్లు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, సాహితీవేత్త డీకే చదువుల బాబు సోమవారం తెలిపారు. మూడు దశాబ్దాలుగా కథా సాహిత్యంలో విశేష కృషి చేస్తున్నారు. 700కు పైగా సామాజిక ఇతివృత్త కథలను రచించారు. మార్చి 8న ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు వడలి రాధాకృష్ణ తెలిపారు. చీరాల ప్రముఖులు బత్తుల బ్రహ్మారెడ్డి, కోడూరి ఏకాంబరేశ్వరబాబు, బీరం సుందరరావు, వలివేటి మురళీకృష్ణ, వూర మస్తాన్‌రావు, ఎ.నాగవీరభద్రాచారి, తిరుమలశెట్టి సాంబశివరావు, భాగి కృష్ణమూర్తి, మంత్రి కృష్ణమోహన్‌లు హర్షం వ్యక్తం చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న పైరు దగ్ధం



అద్దంకి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న పైరు దగ్ధమైన సంఘటన సోమవారం మండలంలోని బొమ్మనంపాడు గ్రామంలో జరిగింది. ఫైర్ స్టేషన్ సిబ్బంది అందించిన సమాచారం మేరకు..మండలంలోని బొమ్మనంపాడు గ్రామానికి చెందిన గొట్టిపాటి చిరంజీవి తన పొలంలో మొక్కజొన్న పంటను సాగు చేశారు. అందులో బోరు వేసి విద్యుత్ కనెక్షన్‌తో మోటారు బిగించాడు. ప్రమాదవశాత్తు విద్యుత్‌షార్టు సర్క్యూట్ కావడంతో పంటకు నిప్పంటుకుని కాలిపోయింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే రైతుకు రూ.20వేల వరకు నష్టం వాటిల్లింది.

ఉద్యాన సాగు విస్తీర్ణం పెంచాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



ఉద్యాన పంటల సాగు విస్తీర్ణంపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచడానికి సచివాలయాల స్థాయిలో సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సూచించారు. ఉద్యాన పంటల సాగుపై అనుబంధ శాఖల అధికారులతో సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. జిల్లాలో ప్రధానంగా మిర్చి, పసుపు, అరటి కూరగాయలు, బొప్పాయి పంటలు సాగుచేస్తున్నారన్నారు. ఇప్పటికే 50,965 ఎకరాలలో సుమారు 45 వేల మంది రైతులు ఉద్యాన పంటలను సాగు చేస్తున్నట్లు వివరించారు. తీర ప్రాంతాలలో పూల మొక్కలు విస్తారంగా సాగు అవుతున్నాయన్నారు. ప్రస్తుతం 15 రకాల పంటలు సాగు చేస్తుండగా వాటి సంఖ్య మరింత పెరగాలన్నారు. ఉద్యాన రైతులకు పంట దిగుబడి రాగానే వారి ఉత్పత్తులను విక్రయించుకోవడానికి మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. ముఖ్యంగా ఉద్యాన పంటలు సాగు చేసే ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన రైతులను గుర్తించి వారికి మెలకువలను నేర్పాలన్నారు. రుణాల పంపిణీతో వారికి ఆర్థిక చేయూత అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా సహకరించాలన్నారు. అంతిమంగా ఉద్యాన పంటల సాగు, ఉత్పత్తులు మరింత పెరిగేలా ప్రణాళికతో చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యాన శాఖ ఏడీ జె.జెన్నమ్మ, డ్వామా పీడీ విజయలక్ష్మి, డీఆర్డీఏ పీడీ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

మోటుపల్లిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

బాపట్ల: కాకతీయులు, చోళ రాజుల నాటి అభయ శాసనాల భద్రత కోసం మోటుపల్లిని పర్యాటక రంగంగా అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. మోటుపల్లిలోని వీరభద్రేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధిపై సంబంధిత అధికారులు, ఎన్జీఓలతో సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. కాకతీయ గణపతి దేవుని అభయ శాసనం, అనపోతారెడ్డి అభయ శాసనం, ప్రౌఢ దేవరాయల అభయ శాసనాలను భద్రపరుస్తామని కలెక్టర్ చెప్పారు. ఇందుకోసం దేవాలయం సమీపంలో మ్యూజియం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ ప్రాంతంలో శ్రీకృష్ణదేవరాయులకు ముందు కొండవీటి రాజుల శాసనాలు, కాకతీయుల నాటి శాసనాలు వెలుగులోకి వచ్చాయన్నారు. తవ్వకాలలో 13 చారిత్రాత్మక పంచ లోహ విగ్రహాల లభ్యం కాగా వాటిని హైదరాబాద్‌లోని నాంపల్లి స్టేట్ మ్యూజియంలో భద్రపరిచారని, వాటిని తెప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే విజయవాడలోని బాపూ మ్యూజియంలో భద్రపరిచిన వీరభద్ర స్వామి విగ్రహాన్ని మోటుపల్లికి తెప్పిస్తామన్నారు. మోటుపల్లి దేవస్థానంలో తమిళం, సంస్కృతంలో లిఖితమైన అభయ శాసనాలను తెలుగులోకి అనువాదించి రాళ్లపై చెక్కిస్తామని కలెక్టర్ తెలిపారు. శతాబ్దాల క్రితం సముద్ర వర్తకంపై రాజులు తీసుకున్న నిర్ణయాలు, బీమా సౌకర్యాలు, విధించిన పన్నులు వసూలపై ఆనాటి రాజుల శాసనాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, పురావస్తు శాస్త్రవేత్త జ్యోతి చంద్రమౌళి, మోటుపల్లి హెరిటేజ్ సొసైటీ కార్యదర్శి దశరథ రామిరెడ్డి, సభ్యుడు ఓటుకూరి శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన చికిత్స

మహిళ కడుపు నుంచి మూడున్నర కిలోల బరువైన కణితి తొలగింపు



శస్త్ర చికిత్స చేయించుకున్న రిజ్వానాతో డాక్టర్ కిషోర్ కుమార్, వైద్య బృందం

మార్టూరు: మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు ఒక మహిళ పొట్ట నుంచి మూడున్నర కిలోల బరువైన కణితిని శస్త్రచికిత్స ద్వారా విజయవంతంగా తొలగించారు. రోగి, ఆసుపత్రి వైద్యుల వివరాలు ఇలా ఉన్నాయి.. పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలోని పురుషోత్తమ పట్నంకు చెందిన షేక్ రిజ్వానా గత కొంతకాలంగా కడుపు నొప్పి, రక్త స్రావంతో బాధపడుతూ ఉంది. రెండు మూడు ప్రైవేట్ ఆసుపత్రులను సంప్రదించిన రిజ్వానాను వైద్యులు కడుపులో గడ్డ ఉంది తొలగించడానికి రూ.70 వేల నుంచి లక్ష వరకు ఖర్చు అవుతుందని తెలపడంతో కూలీ నాలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే రిజ్వానాకు అంత స్తోమత లేక బంధువుల సమాచారంతో మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరింది. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గత కొంత కాలంగా అనేక శస్త్ర చికిత్సలు విజయవంతంగా పూర్తి చేసిన జనరల్ సర్జన్ జి.కిషోర్ కుమార్ రిజ్వానాను ఇన్ పేషెంట్ గా చేర్చుకొని అవసరమైన రక్తాన్ని స్థానిక ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ నుంచి ఉచితంగానే ఎక్కించి శస్త్ర చికిత్స చేశారు. ఆమె కడుపులో నుంచి సుమారు మూడున్నర కిలోల బరువైన కణితిని తొలగించి హిస్టెక్టమీ ఆపరేషన్ చేసినట్లు డాక్టర్ కిషోర్ కుమార్ తెలిపారు. కోలుకొన్న రిజ్వానా సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కుటుంబ పోషణే భారంగా ఉన్న తనకు శస్త్ర చికిత్స చేయించుకుని తిరిగి లేచి తిరుగుతానని అనుకోలేదని డాక్టర్ కిషోర్ కుమార్ తనకు పునర్జన్మ కల్పించారని కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా డాక్టర్ కిషోర్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ మార్టూరు ముప్పయి పడకల ఆసుపత్రిలో గత సంవత్సరం ఏప్రిల్ నుంచి 2025 జనవరి నెలాఖరులోపు 241 మందికి శస్త్ర చికిత్సలు చేసినట్లు తెలిపారు. అన్ని రకాల కణితులు, గడ్డలు తొలగించడం హైడ్రోసెల్, హెర్నియా, ఫైల్స్, ఫిషర్, ఫిస్టులా, అపెండిసైటిస్ మరియు షుగర్ వ్యాధి తీవ్రత వలన శరీరంలోని అవయవాలను తొలగింపు మొదలైన శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామని రోగులు నిర్భయంగా ఆసుపత్రికి వచ్చి ఉచితంగా అవసరమైన వైద్య సదుపాయం, శస్త్ర చికిత్సలు చేయించుకోవచ్చని తెలిపారు.



శస్త్ర చికిత్స చేసి తొలగించిన కణితి

ఉత్సాహంగా పోలు రాధా ఎడ్ల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ శీలం రమేష్



ప్రదర్శనలో పాల్గొన్న ఎడ్ల జత

చినగంజాం: మహాశివరాత్రి పురస్కరించుకొని స్థానిక రామకోటేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో రాష్ట్రస్థాయి న్యూ జూనియర్ విభాగం నాటుబండి పోలురాధా ఎడ్ల పందేలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ టీఎస్సార్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఎస్‌ఐ శీలం రమేష్ పోటీలను ప్రారంభించారు. పోటీలకు రాష్ట్ర స్థాయిలో సుమారు 20కి పైగా ఎడ్ల జతలు పాల్గొన్నాయి. పొద్దుపోయేంత వరకు ఎడ్ల పోటీలు కొనసాగించారు. భారీస్థాయిలో అభిమానులు పాల్గొన్నారు.


నేషనల్ పవర్‌లిఫ్టింగ్‌లో అనీల్‌రెడ్డికి ప్రథమస్థానం



సూరత్‌లో అనీల్‌రెడ్డికి మెడల్, సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

నరసరావుపేట: రొంపిచర్ల మండలం రామిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మూలే అనీల్‌రెడ్డి నేషనల్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానం సొంతం చేసుకున్నాడు. ఓపెన్ ఆసియా పవర్ లిఫ్టింగ్, క్లాసిక్ అండ్ నేషనల్ చాంపియన్‌షిప్–2025 పోటీలను గుజరాత్ రాష్ట్రంలోని సూరత్, అత్వాలీనెస్‌లోని పండిట్ దయాల్ ఉపాధ్యాయ ఇండోర్ స్టేడియంలో ఈనెల 21 నుంచి 23వరకు స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ సూరత్ అండ్ సూరత్ సిటీ పోలీసు, పవర్ లిఫ్టింగ్ ఇండియా సంస్థ నిర్వహించాయి. ఈ పోటీల్లో పాల్గొన్న అనీల్‌రెడ్డి 65 కేజీల విభాగంలో 405 కేజీల బరువు ఎత్తి ప్రథమస్థానంలో నిలిచాడు. అతనికి వరల్డ్ రా పవర్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ ఇండియా (డబ్ల్యూఆర్‌పీఎఫ్) అధ్యక్ష, కార్యదర్శులు సునీల్ లోహట్, ధర్మేష్‌పటేల్ మెడల్, సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. అనీల్‌ను రామిరెడ్డిపాలెం గ్రామస్తులు అభినందించారు.

ప్రకా'శివ'ంతం



అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయాన్ని బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. రాజగోపురంపై విద్యుద్దీప కాంతుల్లో తళుకులీనుతున్న పార్వతీ పరమేశ్వరుల అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

– అమరావతి

లక్ష్మణరావుకు వైఎస్సార్ టీఎఫ్ మద్దతు

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 27న జరగనున్న కృష్ణా–గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ తరఫున పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు మద్దతు ప్రకటిస్తున్నట్లు వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ సాగర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫెడరేషన్ రాష్ట్ర నాయకుల సూచన మేరకు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో భాగంగా గుంటూరు, కృష్ణా జిల్లాల అధ్యక్షులు వై.థామస్‌రెడ్డి, మహంకాళిరావు, ఇతర నాయకుల సమక్షంలో కేఎస్ లక్ష్మణరావుకు మద్దతు ప్రకటిస్తూ, తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు.

కొడుకు మృతి కారకులపై కేసు నమోదు చేయండి

ఎస్పీకి తల్లిదండ్రులు ఫిర్యాదు



ఎస్పీ కార్యాలయం వద్ద వివరాలు వెల్లడించిన బాణావత్ నాగేశ్వరరావు నాయక్ దంపతులు

నరసరావుపేట: తమ కుమారుడు మృతికి కారకులైన కోడలు, ఆమె తల్లిదండ్రులు, ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తిపై కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని మృతుని తల్లితండ్రులు, బంధువులు కోరారు. ఈ మేరకు ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించేందుకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వారి కథనం ప్రకారం.. కారెంపూడి మండలం పేటసన్నెగండ్ల తండావాసి బాణావత్ నాగేశ్వరరావు నాయక్ కుమారుడు గోపీనాయక్(34)కు 14 ఏళ్ల క్రితం తన చెల్లెలు కుమార్తెతో పెళ్లి జరిపించాడు. వారికి ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. కోడలు పేటసన్నెగండ్లకు చెందిన కాసుల కుమారుడు షేక్ కరిముల్లాతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో పలుమార్లు హెచ్చరించారు. పెద్దమనుషులు సమక్షంలో పంచాయితీ జరిగినా ఆమెలో మార్పులేదు. గోపీనాయక్‌ను చంపి అడ్డం తొలగించుకోవాలనే ఉద్దేశంతో కోడలు, ఆమె ప్రియుడు, ఆమె తల్లిదండ్రులు పథకం రచించి కారెంపూడి వెళ్లి పురుగుమందుల డబ్బా కొని తీసుకొచ్చి గతేడాది సెప్టెంబరు 27న గోపీనాయక్‌కు స్పిరిట్‌లో కలిపి ఇచ్చారు. దీంతో వాంతులు చేసుకుంటున్న గోపీనాయక్‌ను గుంటూరులోని ప్రైవేటు హాస్పిటల్‌లో చేర్పించగా పరిస్థితి విషమించి అక్టోబర్ 1న మరణించాడు. దీనిపై కారెంపూడి పోలీసులకు గోపీనాయక్ తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. అయినా నిందితులపై పోలీసులు చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి కేసు నమోదు చేసి దర్యాప్తుచేయాలని గోపీనాయక్ తల్లిదండ్రులు కోరుతున్నారు.

సౌత్‌జోన్ నేషనల్ షూటింగ్ బాల్ పోటీల్లో ఏపీ విజయం

జట్టులో యద్దపాడు పైపల్లె అక్కాచెల్లెళ్లు



క్రీడాకారిణులను అభినందిస్తున్న విశ్వతేజ నూలుమిల్లు ఎండీ దాసరి చంద్రశేఖర్

యద్దపాడు: సౌత్‌జోన్ నేషనల్ షూటింగ్‌బాల్ పోటీల్లో ఏపీ జట్టు విజయకేతనం ఎగురవేసింది. ఈనెల 22, 23 తేదీల్లో బాపట్ల మండలం చిమ్మిరిబండ గ్రామంలో సౌత్‌జోన్ నేషనల్ షూటింగ్‌బాల్ బాలుర, బాలికల విభాగాల్లో జాతీయస్థాయి పోటీలను నిర్వహించారు. ఆయా పోటీల్లో ఆరురాష్ట్రాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. వీటిలో ఆంధ్రప్రదేశ్ బాలికల విభాగంలో తెలంగాణపై రెండు– సున్నా తేడాతో విజయం సాధించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.

మరిన్ని విజయాలు సాధించాలి...

యద్దపాడు గ్రామం పైపల్లె (ఎస్సీకాలనీ)కి చెందిన కోడిరెక్క అన్నమ్మ కుమార్తెల్లో కోడిరెక్క ధనలక్ష్మి ఏపీ బాలికల జట్టు కెప్టెన్‌గా వ్యవహరించగా ఆమె సోదరి కోడిరెక్క పాప సభ్యురాలిగా సత్తాచాటింది. ఈ సందర్భంగా బోయపాలెం విశ్వతేజ నూలుమిల్లు ఎండీ దాసరి చంద్రశేఖర్ సోమవారం అక్కాచెల్లెళ్లు ఇద్దరినీ అభినందించారు. గతంలో కెప్టెన్ ధనలక్ష్మికి రూ.55వేలు ఆర్థికసాయం అందించామని, ఈసారి అక్కాచెల్లెళ్లకు బీటెక్, డిగ్రీలలో చేరేందుకు కళాశాలల ఫీజులను చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

రైలు ఢీకొని యువకుడు మృతి

వేటపాలెం: రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీ కొనడంతో యువకుడు మృతి చెందాడు. స్థానిక రైల్వే స్టేషన్‌లో రెండో నెంబరు ప్లాట్ ఫాం వద్దగల ట్రాక్ పై సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. దేశాయపేట పంచాయతీ రైల్వే స్టేషన్ అవతల గల రాధాకృష్ణాపురం కాలనీకి చెందిన షేక్ కరీముల్లా (24) వేటపాలెం వస్తూ రైల్వే స్టేషన్‌లో పట్టాలు దాటుతున్నాడు. అదే సమంలో సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ రైలు ఢీ కొట్టడంతో తీవ్రగాయాలపాలై అక్కడి కక్కడే మృతి చెందాడు. యువకుడు బేల్దారీ పనులు చేస్తుంటాడు. జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేసుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

విద్యుత్‌షాక్‌తో కౌలు రైతు మృతి



అట్ల సుబ్బారెడ్డి మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య, బంధువులు

కర్లపాలెం: విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని తిమ్మారెడ్డిపాలెంలో సోమవారం చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్‌ఐ ఎ.రవీంద్ర తెలిపిన వివరాల మేరకు బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం కొత్త నందాయపాలెం గ్రామానికి చెందిన అట్ల సుబ్బారెడ్డి(39) దుండివారిపాలెం పంచాయతీ తిమ్మారెడ్డిపాలెం సమీపంలోని మెరైన్ ఫుడ్ పార్క్ సమీపంలో కౌలుకు ఎకరన్నర విస్తీర్ణంలో పచ్చిమిరప తోట సాగు చేశాడు. ఈనేపథ్యంలో సోమవారం మిరపతోటలో కూలీలు కలుపు తీస్తుండగా మధ్యాహ్నం సుబ్బారెడ్డి సతీష్ ఫుడ్ పార్క్ సమీపంలోని ఓ హోటల్‌లో టిఫిన్ చేసేందుకు వెళ్లి చేతులు కడుక్కుంటుండగా అక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ తగలటంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడని తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య యమున ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మణికేశ్వరంలో క్షుద్రపూజల కలకలం

అద్దంకి రూరల్: మండలంలోని మణికేశ్వరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో సోమవారం క్షుద్రపూజల కలకలం రేగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం అర్ధరాత్రి జనసంచారం లేని సమయంలో రోడ్డుపై ముగ్గువేసి అందులో నిమ్మకాయలు, బొగ్గు వేసి క్షుద్రపూజలు చేశారని, గతంలో కూగా కోడి గుడ్లతో ఇలాంటి పూజలే చేశారని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

ఇంటి దగ్గరే లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణ

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు అనారోగ్యం, ఇతర కారణాలతో లైఫ్ సర్టిఫికెట్లు కోసం రాలేని పరిస్థితులలో అసోసియేషన్ ప్రతినిధులు ఇంటి వద్దకే వచ్చి తీసుకునే వెసులుబాటు కల్పించినట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మానం సుబ్బారావు తెలిపారు. అసోసియేషన్ భవన్‌లో సోమవారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సుబ్బారావు మాట్లాడుతూ, ఫిబ్రవరి నెల ముగుస్తున్న నేపథ్యంలో సభ్యులు వెంటనే ట్రెజరీ కార్యాలయంలో లైఫ్ సర్టిఫికెట్లు అందచేయాలని కోరారు. ఫ్యామిలీ పెన్షన్‌లు, హెల్త్ కార్డులలో సవరణలను తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని తెలిపారు. గౌరవాధ్యక్షుడు లంకా రంగనాయకులు, కార్యదర్శి సి.సి.ఆదెయ్య, కోశాధికారి ఎంఎస్ఆర్‌కె ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

కోర్కెలు తీర్చే బాలకోటేశ్వరుడు



ఆలయ ధర్మకర్త చీమకుర్తి యలమందయ్య సమాధి



తిరునాళ్లకు సిద్ధమైన దేవాలయం



క్వారీ బాలకోటేశ్వరస్వామి మూల విరాట్

- భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి
- మహా శివరాత్రి తిరునాళ్లకు సన్నద్ధం



తిరునాళ్లకు వచ్చిన భారీ విద్యుత్ ప్రభలు (ఫైల్)

చేబ్రోలు: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీలోని శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవాలయం సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. రంగులతో ఆలయాన్ని చక్కగా తీర్చిదిద్దారు. జిల్లాలో కోటప్పకొండ తిరునాళ్ల తరువాత చెప్పుకోదగినది ఇదే. భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా ఇక్కడి స్వామి విరాజిల్లుతున్నారు. సుమారు వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన ఆలయం వద్ద సుమారు 80 సంవత్సరాలుగా ఏటా తిరునాళ్ల జరుగుతోంది. మొదటిసారిగా చేబ్రోలు మండలం గొడవర్రు గ్రామస్తులు ప్రభను తిరునాళ్లకు తీసుకొచ్చినట్లు ప్రతీతి.

ఇదీ తిరునాళ్ల నేపథ్యం...

1920వ సంవత్సరంలో చీమకుర్తి యలమందయ్య వడ్లమూడి గ్రామంలోని తన పొలం దున్నుతుండగా శివలింగం బయటపడింది. విగ్రహాన్ని అక్కడే ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు చేశారు. గ్రామంలో అరిష్టాలు జరగటంతో దీనికి కారణం విగ్రహానికి పూజా కార్యక్రమాలు నిర్లక్ష్యం చేయటమేనని స్థానికులు భావించారు. ఓ రోజు యలమందయ్యకు కలలో బాలకోటేశ్వరస్వామి కనిపించి తనకు గుడి నిర్మించి పూజలు చేయవలసిందిగా ఆజ్ఞాపించారని ప్రచారం ఉంది. స్వామి వారి ఆజ్ఞానుసారం యలమందయ్య పొలంలో లభించిన శివలింగానికి గుడి కట్టించి పూజాది కార్యక్రమాలు చేయించారు. దేవుని సేవలో నిమగ్నమయ్యారు. మొదటి సారిగా మండలంలోని గొడవర్రు గ్రామస్తులు ప్రభను తిరునాళ్లకు తీసుకువచ్చారు. అప్పటి నుంచి గొడవర్రు గ్రామ ప్రభ దేవాలయానికి మహాశివరాత్రికి ముందు వరుసలో ఉంటుంది. శివరాత్రి సందర్భంగా జరిగే తిరునాళ్లకు జిల్లా నలుమూలల నుంచి సుమారు లక్ష మంది భక్తులు వస్తుంటారు. ఆలయ ధర్మకర్త యలమందయ్య కోరిక మేరకు ఆయన మరణానంతరం ఆలయానికి ఆగ్నేయ దిశలో తెనాలి రోడ్డు పక్కనే సమాధి చేశారు. కాలక్రమంలో భక్తుల రాక పెరగటంతో ఆలయం అభివృద్ధి చెందింది. సూర్యదేవర వెంకటప్పయ్య అనే భక్తుడు నిజాంపట్టణం మండలం నక్షత్ర నగర్‌లో తనకు ఉన్న ఎకరం భూమిని ఆలయ నిర్వహణకు రాసిచ్చారు. జిల్లాలో వడ్లమూడి క్వారీ తిరునాళ్లకు ఆదరణ, గుర్తింపు లభించటంతో అధికారులు ఈ ఆలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి తెచ్చారు. కోరిన కోర్కెలు తీరతాయని భక్తుల నమ్మకం. భారీ విద్యుత్ ప్రభలు ఈ తిరునాళ్లలో ప్రత్యేక ఆకర్షణ. నారాకోడూరు, గుండవరం, గొడవర్రు, సుద్దపల్లి, చేబ్రోలు, శలపాడు, శేకూరు, వడ్లమూడి గ్రామాల నుంచి 15 వరకు భారీ విద్యుత్ ప్రభలు, వందల సంఖ్యలో చిన్న ప్రభలు తిరునాళ్లకు దేవాలయానికి వస్తాయి. ఆలయం వద్ద ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. ఈ నెల 27వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా 26వ తేదీన జరిగే మహాశివరాత్రి తిరునాళ్ల సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.